క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్న ఎస్సై

కమాన్‌పూర్: మండంలోని అన్ని గ్రామాలు, ప్రధాన రహదారుల వెంట సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలందరూ సహకరించాలని ఎస్సై షేక్‌మస్తాన్ అన్నారు. శనివారం పెంచిక లోపేటలో సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. గ్రామాల్లో దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టాలంటే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్క సీసీ కెమెరా వంద మందితో సమానమన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను కమాండ్ కంట్రోల్ చేసి అన్ని కెమెరాల నిఘాను స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నర్సరీలో మొక్కలను సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సుల్తానాబాద్: నర్సరీలో మొక్కలను వేసవి కాలంలో సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం సుల్తానాబాద్ పట్టణంలో ఉన్న నర్సరీలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు పెంచడానికి మట్టితో పాటు ఎరువులను కలిపి నాటాలని సూచించారు. ఆయన వెంట కమిషనర్ రాజశేఖర్, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ సిబ్బంది ఉన్నారు.

స్వామి వారి కల్యాణానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికలు అందిస్తున్న ఎంపీపీ

కాల్వశ్రీరాంపూర్: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవానికి రావాలని ఎంపీపీ నూనేటి సంపత్ యాదవ్ శనివారం ఇంటింటికీ వెళ్లి ఆహ్వానపత్రికలు అందించారు. ఆయన వెంట సర్పంచ్ కొనకటి మల్లారెడ్డి, వార్డు సభ్యులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌కు రూ. 46,500, గాండ్ల అఖిలకు రూ.15 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు ప్రభుత్వం నుంచి మంజూరు కాగా, చెక్కులను శనివారం లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, ఎంపీటీసీ శేవ్వ శంకరయ్య, నాయకులు రంగు సత్యనారాయణ గౌడ్, భూంపెల్లి రాజయ్య, శీలారపు మల్లయ్య, పెండ్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానా వైద్యురాలికి సన్మానం

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల పల్లె దవాఖానా వైద్యురాలిగా విధుల్లో చేరిన డాక్టర్ దీరజను శనివారం సర్పంచ్ గంట పద్మ సన్మానించారు. పల్లె దవాఖానాలో వైద్యురాలు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టె సందీప్, ఉప సర్పంచ్ కనుకయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళను ఆశ్రమానికి తరలింపు

పాలకుర్తి: మండలంలోని పుట్నూర్ గ్రామంలో గతకొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళను శనివారం ఆశ్రమానికి తరలించారు. గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్ మహిళ విషయాన్ని తహసీల్దార్ సునీత, బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న కల్వరి యువశక్తి అనాథ ఆశ్రమ నిర్వాహకులకు సమాచారం అందించారు. ఆశ్రమ నిర్వాహకులు ముల్కల కుమార్ తహసీల్దార్ సునీత సమక్షంలో మతిస్థిమితం లేని మహిళను వారి ఆశ్రమానికి తీసుకెళ్లారు.






ఆడుతూ.. పాడుతూ..

- సమ్మర్‌క్యాంప్‌లో సరదాగా చిన్నారులు
- ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు
- ఆత్మరక్షణకు కరాటే..
- కళాభిరుచికి కూచిపూడి
- పెద్దపల్లిలో ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

సండే స్పెషల్





పెద్దపల్లిరూరల్: విద్యార్థుల పరీక్షలు ముగిసి వేసవి సెలవులు వచ్చాయి. వేసవికాలంలో పిల్లలు ఎక్కువ సమయాన్ని వృథా చేస్తారు. అమ్మమ్మ వాళ్ల ఇళ్లకు లేదా చుట్టాల ఇళ్ల వెళ్లి వేసవి సెలవులను సంతోషంగా గడపడానికి ఇష్టపడుతారు. లేదా ఇళ్లలో ఉండి అటు, ఇటూ తిరుగుతూ అల్లరి పనులు చేస్తుంటారు. ప్రస్తుతం చిన్న పిల్లలు మొదలుకొని 14 ఏళ్ల లోపు పిల్లలు బయట ఎంజాయ్ చేయడం కన్నా.. ఫోన్ల కే సమయాన్ని కేటాయిస్తూ ఫోన్లలో పొద్దంతా గడుపుతున్నారు. అయితే ఈ సమ్మర్ హాలీడేస్‌లో వారికి ఇష్టమున్న, అభిరుచి గల ఏదో ఒక రంగంలో శిక్షణ ఇప్పించడం మేలని భావించి తల్లిదండ్రులు వారికి శిక్షణ ఇప్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పెద్దపల్లిలో ఇటీవల ప్రారంభమైన గృహమ్స్ అభ్యాస్ హాబీ స్కూల్ సమ్మర్ క్యాంపులో చేర్పించి 45 రోజుల పాటు శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటిదాకా చదువులకే పరిమితమైన విద్యార్థులు ఈ స్కూల్‌లో చేరి మానసికోల్లాసంతో తమకు ఇష్టమైన పలు కోర్సుల్లో శిక్షణ పొందుతూ హుషారుగా నేర్చుకుంటున్నారు.

కోరుకున్న కోర్సుల్లో శిక్షణ..

అభ్యాస్ స్కూల్‌లో చేరిన పిల్లలు తాము కోరుకున్న కోర్సుల్లో శిక్షణనిస్తున్నారు. కరాటే, బాక్సింగ్, నాన్‌చాక్ తో పాటు కూచిపూడి, థింసా, వెస్ట్రన్‌డాన్స్, ఫోక్‌డాన్స్, పాప్, హిప్‌హప్, విలువిద్య, టేబుల్ టెన్నిస్, డ్రాయింగ్, పెయింటింగ్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, క్యారం, చెస్, నెట్ క్రికెట్, మ్యూజిక్‌లో అనుభవంగల ఉపాధ్యాయులతో శిక్షణ నిప్పిస్తున్నారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదులుకుని..

బీటెక్ పూర్తిచేసిన తర్వాత సాఫ్ట్‌వేర్‌గా పనిచేశా. కరోనా సమయంలో ఇంటినుంచే పనిచేయాల్సి వచ్చింది. ఆ సమయంలో మేం ఆలోచించి అభ్యాస్ హాబీ స్కూల్‌ను ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చాం. పేరెంట్స్ నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోంది. – లావణ్య, నిర్వాహకురాలు

ఇతర నగరాల్లో చూశా...



బీటెక్ చదివిన తర్వాత మిలటరీకి ఎంపికయ్యా. ఉద్యోగ రీత్యా దేశంలోని పలున గరాల్లో తిరిగా. స్థానికంగా ఉన్న సంప్రదాయాలకనుగుణంగా ఇలాంటి శిక్షణ కేంద్రాలను గమనించా. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ పెద్దపల్లిలో ప్రారంభించాలనే ఆలోచనతో ఏర్పాటు చేశా.

–శ్రావణ్‌కుమార్, మియాపూర్

కూచిపూడిలో శిక్షణ



వేసవి సెలవుల్లో పిల్లలు ఇంట్లో ఉండడం కన్నా తమకు ఇష్టమున్న ఏదో రంగంలో శిక్షణ ఇప్పిస్తే మంచిదనే ఆలోచనతో మా పాపాయికి కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తున్నా. తను కూడా ఎంతో ఇష్టంగా నేర్చుకుంటోంది. ఈ శిక్షణ పాపకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– ఎం.రజిత, చీకురాయి

మ్యూజిక్, టెన్నిస్ ఇష్టం...



నాకు మ్యూజిక్, టేబుల్‌టెన్నిస్ ఆడడం అంటే చాలా ఇష్టం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట దాకా సమ్మర్‌క్యాంపు క్లాస్‌లకు హాజరవుతున్నా. సాయంత్రం గంట సేపు మ్యూజిక్, టేబుల్ టెన్నిస్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను.

– సూర్యతేజ, పెద్దపల్లి

స్కూల్‌లో ప్రదర్శన ఇచ్చా



అభ్యాస్ స్కూల్‌లో మూడు నెలల కిందటే చేరా. అప్పటి నుంచి కూచిపూడిలో శిక్షణ పొందా. 26 జనవరి న కలెక్టరేట్ వద్ద, ఆతర్వాత మా స్కూల్‌లో జరిగిన ప్రోగ్రాంలో నృత్యప్రదర్శన చేసి అందరితో మన్ననలను పొందడం మంచి అనుభూతినిచ్చింది.

– తన్వి, ఆరోరగతి విద్యార్థిని

చెత్తశుద్ధి కేంద్రం పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో రోజు సేకరించే వ్యర్థాలను శుద్ధిచేసి ఎరువుగా మార్చేందుకు వీలుగా ఎఫ్ఎస్‌టీపీ (ఫెకల్‌స్లెడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్) పనులను శనివారం ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి ప్రారంభించారు. రాఘవాపూర్ శివారులోని డంపింగ్ యార్డు ప్రాంతంలో చెత్త శుద్ధి కేంద్రాన్ని నిర్మించే పనులకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు కనీస మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. చెత్తను, మల, మూత్ర వ్యర్థాలను శుద్ధి చేసి ఎరువులుగా మార్చి వినియోగిస్తారన్నారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, ఏఈలు సతీశ్, మనోహర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్యదర్శుల దీక్ష



కాల్వశ్రీరాంపూర్‌లో సర్పంచ్‌ల సంఘీభావం

జూలపల్లి: ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు కొనసాగింది. ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. దీక్షలో పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

సమ్మెకు సర్పంచుల సంఘీభావం

కాల్వశ్రీరాంపూర్:జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు కాల్వశ్రీరాంపూర్ మండల సర్పంచులు శనివారం సంఘీభావం తెలిపారు. కార్యదర్శుల దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాసర్ల తిరుపతి రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలపరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శనివారం రెండో రోజూ కొనసాగింది. కార్యదర్శులకు ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిసెంట్లు, ఉప సర్పంచ్‌ల ఫోరం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

కార్యదర్శుల దీక్షలకు బీజేపీ సంఘీభావం

రామగుండం: పంచాయతీ కార్యదర్శుల దీక్షకు శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి,తదితరులు సంఘీభావం తెలిపారు.

సుల్తానాబాద్‌రూరల్: మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు మండల కార్యదర్శులు నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. కార్యక్రమంలో జూనియర్, ఔట్ సోర్సింగ్ కార్యదర్శులున్నారు.

మంథని: పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు శనివారం కాంగ్రెస్, ప్రజా సంఘాల నాయకులు వేర్వేరుగా మద్దతు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్, కాంగ్రెస్ నాయకులు మంథని సత్యం, రావికంటి సతీశ్ తదితరులు ఉన్నారు.

ఓదెల: కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా ఉపాధ్యక్షుడు బానుప్రసాద్ అన్నారు. శనివారం ఓదెలలో నిరసనదీక్షకు ఎంపీడీవో తదితరులు సంఘీభావం తెలిపారు.

రైతుల సంక్షేమానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జూలపల్లి: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెటుకొని ప్రతి గ్రామంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ అన్నారు. జూలపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్,కుమ్మరికుంటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా దూళికట్ట పీఏసీఎస్ నుంచి వడ్కాపూర్,కీచులాటపల్లె, బాలరాజుపల్లె, వెంకట్రావుపల్లె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, సంఘాల చైర్మన్లు కొంజెర్ల వెంకటయ్య, పుల్లూరి వేణుగోపాలరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచులు నర్సింహ యాదవ్, తిరుపతి, రేచవేని రాధ,రాజయ్య, సంతోశ్‌రావు,ఎంపీటీసీలు సీఈవోలు సురేశ్,రవీందర్ రెడ్డి,డైరెక్టర్లు సమ్మయ్య, భగవంతరావు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌ధారులకు చెక్కులను శనివారం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పంపిణీ చేశారు. పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం అందించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ మేనమామలా సాయం ఇస్తున్నారన్నారు. అంతర్గాం మండలం మద్దిర్యాలలో ప్రభుత్వ భూమిని తమకే కేటాయించాలని రైతులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నగర మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు దాతు శ్రీనివాస్, కన్నూరి సతీష్‌కుమార్, సాగంటి శంకర్, అడ్డాల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో కంటివెలుగు కార్యక్రమం అమలుకు డీఈవోలుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగభద్రత కల్పించాలని డాటాఎంట్రీ ఆపరేటర్లు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సంగీత, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్‌లను కలిసి వినతిపత్రాలను రమ్యశ్రీ, సంధ్య, కార్తీక్, నరేశ్ తదితరులు అందించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో డీఈవోల అవసరం ఉందన్నారు. కంటివెలుగులో డీఈవోలుగా పనిచేస్తున్న 34మందికి అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

✦ ట్రినిటీ ఫార్మసీ అధ్యాపకుడికి డాక్టరేట్

ఓదెల:పెద్దపల్లి ట్రినిటీ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఓదెల గ్రామానికి చెందిన మాటేటి అశోక్ డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ జే రాజు పర్యవేక్షణలో ప్రో వేసిక్యూలర్ బెస్ట్ కొల్లాయిడల్ కారియర్స్ ఫర్ ట్రాన్స్ డర్మల్ డెలీవరీ అనే అంశంపై అశోక్ పరిశోధన చేశారు. హైదరాబాద్ జేఎన్టీయూ యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పొందారు. డాక్టరేట్ పొందిన అశోక్‌ను గ్రామస్తులు, శ్రేయోభిలాషులు మిత్రులు అభినందించారు.

✦ 'కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేల జాబితాను బయటపెట్టాలి'

గోదావరిఖని: దళితబంధులో నిరుపేద దళితుల దగ్గర కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేల పేర్లు బయట పెట్టాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ రామగుండం ఇన్‌చార్జి జిమ్మిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా బాగుపడాలని చేపట్టే దళిత బంధులో కమీషన్లు తీసుకున్న ఎమ్మెల్యేలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం వ్యాఖ్యలను కోర్టు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలన్నారు. లేని పక్షంలో వైస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

✦ తాజొద్దీన్ బాబా గంధం ఊరేగింపు

గోదావరిఖనిటౌన్: నాగపూర్ తాజొద్దీన్ బాబా ఉర్సు ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్థానిక సప్తగిరికాలనీలోని శ్రీరెడ్డిబాబా ఆశ్రమంలో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పుర వీధుల్లో గంధం ఊరేగింపు చేసి, బాబా మందిరంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దీటి బాలరాజ్‌కుమార్, అద్యాల రామస్వామి, బాబా భక్తులు పాల్గొన్నారు.

✦ విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో విద్యుత్ తీగలు తెగి కాలువలో పడగా, పశువులు నీళ్లు తాగేందుకు వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. గ్రామానికి చెందిన ఎంచర్ల రాజయ్య అనే పాడిరైతు ఇటీవల రూ.లక్ష వెచ్చించి పాలు ఇచ్చే రెండు గేదెలు కొన్నానని బోరున విలపించాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంవల్లే ఈ ప్రమాదం జరిగిందని, విచారణ జరిపి సదరు అధికారులపై చర్యలు తీసుకుని పాడి రైతుకు పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

✦ ఉచిత వృత్తి విద్య కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

జూలపల్లి: గ్రామాల్లో విద్యావంతులైన నిరుద్యోగులకు ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఫౌండేషన్ మండల ఆర్గనైజర్ గుంటి శంకర్ తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు గల నిరుద్యోగులకు రాయికల్ మండలంలోని ఆమ్మక్కపేట సెంటర్‌లో ఉచితంగా నర్సింగ్, బైక్ మెకానిజం, సోలార్, టైలరింగ్, బ్యాంకింగ్‌లో ఉచిత శిక్షణతో పాటు భోజనవసతి సౌకర్యం కూడా కల్పించనున్నట్లు వివరించారు. ఆసక్తి గల నిరుద్యోగులు తమ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

✦ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అభిశేఖర్

కోల్‌సిటీ: బీసీ సంక్షేమ సంఘం రామగుండం యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోదావరిఖని రమేశ్ నగర్‌కు చెందిన గర్వందుల అభిశేఖర్ నియామకమయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంథని రఘువీర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కార్పొరేషన్ కార్యదర్శిగా గాది రాజమల్లును నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

✦ కాంగ్రెస్ పార్టీ మండల మహిళా కమిటీ ఏర్పాటు

కమాన్‌పూర్: రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీని ఏర్పాటు చేసినట్లు మహిళ అధ్యక్షురాలు పబ్బతి రాధా రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా జాగిరి రజిత, ప్రధాన కార్యదర్శిగా కావేటి మల్లేశ్వరి, అధికార ప్రతినిధిగా పత్తి సువర్ణ, కార్యదర్శిగా సుద్దాల రాధ, కోశాధికారిగా దువ్వ స్వరుప, ప్రచార కమిటీ సభ్యురాలుగా మొగిలి రేణుకను ఎన్నుకున్నట్లు రాధారెడ్డి తెలిపారు.

వేసవిలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సతీశ్

మంథని: వేసవి సెలవుల్లో పిల్లలను జాగ్రతగా చూసుకోవాలని, వారిపై శ్రద్ధ వహించాలని మంథని సీఐ సతీశ్ సూచించారు. జవహర్ నవోదయ పరీక్ష అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు స్థానికు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద అవగాహన కల్పించారు. పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇచ్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫోన్‌పే, గూగుల్ పే లాంటి అకౌంట్ నంబర్లు ఉన్న మొబైల్ నంబర్ వాడటం వల్ల అందులో ఉన్న యాప్‌లో వచ్చే నోటిఫికేషన్లు తెలియకుండా క్లిక్ చేయడం వల్ల నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వేసవిలో పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షత పాటిస్తే చర్యలు తప్పవు



ఎలిగేడులో పౌరహక్కుల దినోత్సవం

ఎలిగేడు: గ్రామాల్లో కుల వివక్షతలు పాటిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజమ్మ, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. శనివారం ఎలిగేడులో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలందరూ కుల,మత తారతమ్యభేదాలు లేకుండా సామరస్య వాతావరణంలో సోదరభావంతో కలిసి, మెలసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఆర్ఐ శైలజ, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌరహక్కుల పై అవగాహన కలిగి ఉండాలి

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మండలం ముల్కలపల్లి, రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామాల్లో శనివారం అధికారులు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందన్నారు. కుల వివక్ష లేకుండా గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై షేక్‌మస్తాన్, సర్పంచ్ గంట పద్మ, ఆర్ఐలు రాజాబాపు, సంధాని, గంట వెంకటరమణరెడ్డి, వీఆర్ఏలు పాల్గొన్నారు.

జూలపల్లి: మూఢనమ్మకాలు, అంటరాని తనాన్ని ఎవరూ ప్రోత్సహించవద్దని తహసీల్దార్ జయశ్రీ సూచించారు. శనివారం మండలంలోని వడ్కాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు చట్టాలు, తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాంకాలి తిరుపతి, ఎంపీటీసీ రమేశ్,ఆర్ఐ సంపత్ ,పంచా యతీ కార్యదర్శి మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

బలగం సినిమా నటుడికి సన్మానం

కాల్వశ్రీరాంపూర్: బలగం సినిమాలో మటన్ బొక్క రాజయ్యగా నటించిన ఏలేశ్వరం సత్యనారాయణను ఆయన స్వగ్రామం కాల్వశ్రీరాంపూర్ మడంలం పెగడపల్లిలో శనివారం సర్పంచ్ ఆరెల్లి సుజాత, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో నివాసముంటున్న సత్యనారాయణ పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తూ ఇటీవల విడుదలైన బలగం సినిమాలో నటించి ప్రేక్షకుల నుండి మంచి గుర్తింపు పొందడం అభినందనీయమని సర్పంచ్ సుజాత ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుముకం నిర్మల, ఉప సర్పంచ్ జంగ సుకేందర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొడ్గు రాజకొమురయ్య యాదవ్, హెచ్ఎం సబ్బని ప్రసాద్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.